

'రచన' మాసపత్రిక - ఆగస్టు, 1992

# కథ ప్రహేళిక -8





"అఖిలాంధ్ర పాఠకుల ఆరాధ్య రచయిత... రవిగారు... స్వయంగా ఫో కలుస్తానంటే - కాళీ చేసుకోడా- ఎంత బిజీ డాక్టరయినా-"

"....."

"హలో! హలో! రవిగారూ!.... ఫోన్ డిస్కనెక్ట్ అయిందా? హలో! హలో!"


"ప్చ్!"

'మీ గొంతు అదోలా ఉంది! వంట్లో బాగులేదా! వెంటనే బయల్దేరమంటారా?"

"అవసరం లేదు డాక్టర్!"

"హార్టయారా?"

"వైద్య విద్యను మరిచిపోలేదే!"



"లింకు దొరకటం లెదు సార్!"

"నవలలు రాస్తున్నారూ"

"అవుననుకోండీ"

"అతిశయోక్తులు సుఖమివ్వటం లేదు"

"రవీ!'

"ఈ రాత్రంతా మీరు నాకు కావాలి"

"ష్యూర్!"

"మీ నర్సింగ్ హోమూ, నా యీ కొంపా.... లాభం లేదు. నాచారం పైన ఓ కంట్రీ

క్లబ్ ఉంది"

"నాకు తెలీదే!"

"మీకు చాలా చాలా తెలీవు"

"నన్నేదో దెబ్బ కొడుతున్నారు"

"మిమ్మల్ని బాధపెట్టే హక్కు నాకు లేదా?"

"...."

"చెప్పండి"

"ఉందే – అనుకుందాం!"

"నా అన్వేషణ ఫలించినట్లే ఉంది"

"ఏంటి మీ అన్వేషణ?"

"ముసుగు?"

"ముసుగా – !?"

"అవును డాక్టర్ – ముసుగు – ముసుగు"

"మీరేదో అస్థిమితంగా ఉన్నారు"

"నాచారం దగ్గర అడ్రస్ రాసుకోండి – డాక్టర్!"

**- 2 -**

"రామనావ్ వోడ్కా ఒక బాటిల్! నాలుగు కోలా!... ఫ్రైడ్... చికెన్... ఏముంటే అవ్వి! నీకు చెప్పాలా రామూ! బటర్ నాన్!..నాలుగయిదు డిష్‌లు...!"

"నాన్ వెంటనే సర్వ్ చేయమంటారా రవీ సాబ్!"

"మాకు డిస్ట్రబ్ అవటం యిష్టం లేదు ఏమంటారు డాక్టర్!"

"ఫైవ్ మినిట్స్‌లో వచ్చేస్తాయి సాబ్"

"గుడ్!... డాక్టర్! ఏంటంత ఆలోచన?"

"ఆ రామూ ముఖంలో ఆనందం"

"మీకు ఆనందం కలిగించిందా?"

"మీ మీద అడ్మిరేషన్ పెంచింది?"

"సింపుల్ ట్రిక్! పెద్దవాడిచ్చే పైస కన్న – చూపించే చనువుకి"

"పైసలకయే కాలరీల కన్న భుజం తట్టడానికయే కాలరీలు తక్కువంటారు"

"నన్ను బాగా ఫాలో అవుతున్నారే!"

"మీతో ఏకీభవించలేను సార్?"

"నవలతోనా? కాలరీల ఖర్చు లెక్కల్లోనా?"

"మీరు లెక్కల మనిషి కాదు రవీ!"

"పొగడ్తా?"

"అలా ప్రశ్నించటంలోనే మీరు కాలిక్యులేటివ్ కాదని తెలుస్తోంది."

"...."

"ఏంటలా చూస్తున్నారు?"

"రామూ లేట్ చేసాడు. చూసొస్తాను. జస్టెమూమెంట్."

.....

......

"చూసారా! నన్ను ఇగ్నోర్ చేసి పక్క కాటేజీకి పోయాడు"

"ఎవరున్నారందులో?"

"రాధాకృష్ణ"

"సినిమా హీరో గదా! అట్రాక్షన్ సహజం!"

"హీరో గాదు – మనిషి! మనిషే – ఎక్కడయినా ఎప్పుడయినా! కమాండ్ కమాండే... ఈ అలగా వెధవలని సెట్‌రైట్ చేస్తుంది."

"చాలా సింపుల్ విషయానికి బాగా అప్‌సెట్ అవుతున్నారు. ఇది మీ ఆరోగ్యానికి హెల్ప్ చెయ్యదు"

"నా బుర్ర మాత్రం అప్‌సెట్ అవదు డాక్టర్!"

"నో ఆర్గ్యుమెంట్"

"హవ్ కెన్యూ? మీకు పాయింట్ లేదు! చూడండి! మానేజర్ని వాయిస్తే పనులెలా అవుతాయో!"

....

....

"ఈ యిన్సిడెంట్‌ని బట్టి నేనెలా అర్థమయాను?"

"ఏ యిన్సిడెంట్?"

"చూస్తున్నారు గదా – యిన్సిడెంట్ గుర్తించలేరా? నా పాయింట్ ప్రూవ్ చేసాను. మానేజర్ని వాయించాను. క్షణాల మీద మనకి అటెండయాడు. మనం వంచితే వాళ్ళు వంగుతారు – వంగారు"

"మీరు రైటే!"

"యీ క్లబ్‌లో రెండే పనులు! వంచటం – వంగటం? నగరంలో పెద్దలంతా యిందులో మెంబర్లు! దీన్లో మెంబర్‌షిప్ పరమపదసోపానంలో ఒక నిచ్చెన! ఇందులో చేరాక నేనూ

సినిమాలు తీయగలిగాను.."

"డ్రింక్ తీసుకోండి రవీ!"

"మనం వచ్చిందిందుకేనా డాక్టర్?"

"నన్నూ, వీటిని రప్పించింది మీరు - మీరే చెప్పాలి"

"నాకూ చెప్పాలనుంది! నా చేత చెప్పించే శక్తి మీకుందా?"

"మనస్తత్వ శాస్త్రం చదువుకున్న డాక్టర్‌ని"

"సెక్స్ గురించి సీరియల్ కథలు వ్రాస్తున్న రచయిత-"

"సెక్సు జ్ఞానం జనాలకి అవసరమని నా గాఢ విశ్వాసం"

"మీ విశ్వాసం మీద నాకు అవిశ్వాసం లేదు"

"అయితే - దేనిమీద మీ సంశయం?"

"మీ సామర్థ్యం మీద"

"రవీ!"

"నేను  ఖర్చించే కాలరీలతో నాకు ఎజాక్యులేషన్ అవాలి కదా డాక్టర్!"

"ఎజాక్యులేషన్... కొనుక్కోలేరు! సాధించుకోవాలి!"

"స్వయంతృప్తికీ జిందాబాద్!"

"మీది మంచి సెన్సాఫ్ హ్యూమర్ రవీ!"

"సర్వర్ విషయాన్ని బట్టి నా పాత్రను ఎలా అర్థం చేసుకున్నారూ?"

"ఎందుకు దాన్ని పొడిగించటం?"

"మిమ్మల్ని వైద్యునిగా, రచయితగా, మనిషిగా లెక్క తేల్చుకోవాలి"

"నాలో మూడు లేవు! ఉన్నదొకటే - వైద్యం! ఈ లోకంలో నాకు రోగాలు మాత్రం కనిపిస్తాయి. వాటిని వేటాడాలి! అరికట్టాలి! తరిమి కొట్టాలి! నాకు రోగాలు లేని లోకం కావాలి! నా అవసరం తీరిపోయిన లోకం కావాలి! రచన నాకు ఓ చికిత్సా విధానమే!"

"మీకు ముసుగులేదని నమ్మమంటారా డాక్టర్?"

"నమ్మించాల్సిన అవసరం నాకు లేదు రవీ! ఆ సర్వర్ గొడవ మీరు వదిలేలా లేరు గనక చెపుతున్నాను. మీరతని భుజం తట్టడం ట్రిక్ అయితే - ఆ హీరో తర్వాతయినా మిమ్మల్ని గౌరవించినట్లు ఫీలయ్యేవారు! సహజ స్వభావంతో తట్టారు గనకే - మిమ్మల్ని లోకువ చేస్తాడేమోనని సంశయం! కొన్ని క్షణాల వ్యవధానాన్ని ఆ సంశయమే కొన్ని యుగాల జాప్యంలా భావింపచేసింది! రెస్ట్‌లెస్‌నెస్! వాస్తవానికి - లోకంలో ఎవరి చేతా భుజం తట్టించుకోలేని వాళ్ళు మీలాంటి వాళ్ళని దేవుళ్ళలా చూస్తారు! కొంత లేటయినా మీరు పట్టించుకోరనుకుంటారు!"

"మీకు తెలుగు వచ్చును డాక్టర్!"

"డ్రింక్ తీసుకోండి రవీ!"

"తొందరగా ఉందే! చీర్స్... మీరు వేసుకోలేదేం?"

"రవితో తీసుకోవడంలో థ్రిల్లుంటుంది గానీ - మీ కిప్పుడు కావల్సింది వైద్యం"

"ఏమిటి రోగం?"

"అదే నిదానం చేస్తున్నాను"

"మనిద్దరం బట్టలు విప్పేసుకుంటే మంచిది డాక్టర్"

"మిస్టర్ రవీ!"

"ఒక్కసారిగా గ్లాసు ఫినిష్ చేసినా... నా మెదడు ఫినిష్ అవదు!"

"మొదటే మీరిలా ఉంటే..."

"మీ బట్టల కింద ఏముందో కనబడిపోతుందనా మీ భయం"

"నేను వెళ్తాను రవీ!"

"అదే డాక్టర్! కళాకారుడికీ, వ్యాపారస్తుడికీ తేడా! వాక్యాల పరదాల వెనుక యిద్దరిదీ ఆటే! ఒకరిది వ్యాపారం! యింకొకరిది సాహిత్యం! మీ బట్టలు విప్పితే ఏంటుంటుంది? బొజ్జ! ఏభై మూడేళ్ళ వయసుకీ పాతికేళ్ళ వ్యాపార దక్షతకీ నిదర్శనం! ముసుగులు తీసుకుందామంటే ఏమనే వారు?"

"చాలా అల్లరి మనుషులు మీరు!"

"నో! నేను కళాకారుడిని! రోగిని! బట్టలు.. ముసుగులు... తీసేసుకోవాలనయినా అనుకోగలను! మీరలా అనుకోరు... ఆ సీసా యిలా యివ్వండి!"

"ఫాస్ట్‌గా పోతున్నారు రవీ!"

"తప్పదు డాక్టర్! నన్ను నేను కాలానికి కట్టేసుకున్నాను. ఎప్పుడు తెగిపోతుందో తెలీదు. ఎంత వెనుకబడి పోతానో తెలీదు! ఆడపిల్లల స్వప్నాల లోగిళ్ళలో ఏ కొత్త పూల మొక్క పూస్తుందో! ఒక చిన్ని ఆర్ద్రతా జలబిందువుకి నోచుకోలేక ఏనాడు వాడిపోతానో! నా యింద్రజాలం, నా జగ్లింగ్ ఎప్పుడు యీ ఆంధ్రదేశపు యువతరం ముందు పాతబడిపోతుందో! ఏ కొత్త యింద్రజాలికుడు నన్ను తోసేసి, తొక్కేసి యీ రంగస్థలాన్ని దురాక్రమణ చేస్తాడో!"

"పరాజయాన్ని ఊహించుకొని ఆందోళనకు గురవుతున్నారు - మీకు డాక్టర్ అవసరం!"

"నిజమే! లోకంలో ఏక్టర్లే ఉన్నారు! ముసుగు వీరులే వున్నారు! బురఖా ప్రభవులే ఉన్నారు! మీకు నా రోగం కనపడదు! నా పర్సు కనపడుతుంది! మీరెవరూ ముసుగులు విప్పుకోరు! విప్పుకొనే ఫూల్ చేత విప్పించి వంచుతారు! మీ బొజ్జలు పెంచుతారు!

అయామ్ సారీ యాక్టర్. డ్రింక్‌లో ఏక్ట్ చెయ్యలేను"

"నన్ను నమ్ము! నాకెలాంటి ముసుగులూ లేవు"

"చూపిస్తాను! ఒప్పుకొనే సత్తా ఉందా యాక్టర్!"

"చూపించండి!"

"మీ కథ యిది! చదవండీ వాక్యాలు"

"స్నానిస్తున్నపుడు కదులుతున్న గుండెలు - కూర్చున్నపుడు వంగిన వెన్ను - ఆమె ఒంటి మీద లక్నో నించి తెచ్చిన లజ్ కార్నర్ సోప్ కరిగి ఆమె సౌందర్యానికి ఆత్మ సమర్పణ చేసుకుంటోంది. షవరు ఆగిపోయింది. వాగులాగా సాగే ఆమె నడుము కింది భాగం అరటి బోదెల్లా ఉండి నిగనిగలాడుతోంది."

"ఏమిటండీ ఆ వాక్యాలు?"

"ఏముందందులో!!!"

"ఏం లేదా?"

"ఒకమ్మాయి స్నానం చేసి అద్దంలో తన్ను తాను చూసుకుంటోంది"

"మీరిప్పుడన్నట్టు రాస్తే అర్థమవదా?"

"ఇలా రాస్తే అర్థమవదా?"

"ఎలా రాసినా అర్థమయేటపుడు యిలాగే ఎందుకు రాయాలి?"

"చదివించటానికి "

"హ్హా...హ్హా...హ్హా..."

"మీ వికటాట్టహాసం నాకు నచ్చటం లేదు."

"ముసుగులు! బురఖాలు! రేపర్లు... వెరీగుడ్!"

"అయికాంట్ టేకిట్ ఎనీమోర్ రవీ!"

"ఇలా రాస్తే ఎవడయినా ఎందుకు చదువుతాడు డాక్టర్!"

"సెక్సు పట్ల కుతూహలం సహజం! దాన్ని టికిల్ చేస్తూ నేను ఎడ్యుకేట్ చేస్తున్నాను. నాకు డబ్బూ, కీర్తీ లక్ష్యాలు కావు! ప్రవృత్తి రీత్యా వైద్యుడిని నేను! నా తల్లి స్వతంత్రం కోసం జీవితమంతా జైళ్ళలో గడిపింది. స్త్రీ స్వాతంత్ర్యం కోసం జీవితమంతా ధారపోసిన త్యాగమూర్తి ఆమె! ఆదర్శాల కోసం తను బ్రతికింది! నన్ను బ్రతికేలా పెంచింది"

"మీరు ఎమోషనల్‌గా రియాక్టయారు! ఎమోషనల్ రియాక్షన్‌లో అసత్యానికి అవకాశం లేదు. మీరు అనుమతిస్తే మీ కథల వల్ల ఏమవుతుందో చూపిస్తాను. కెన్యూ టేకిట్ డాక్టర్?"

"మీరు బెల్ట్ కింద దెబ్బ కొట్టకపోతే"

"యింకొంచెం పొయ్యండి"

"లిమిట్స్ చూసుకోండి - రవీ!"

"నా పరిమితుల గురించి... తర్వాత! ముందు మీ... ముసుగులు.."

"యిప్పుడే నేను అసత్యమాడటం లేదని ఒప్పుకున్నారు"

"మీ వల్ల అన్యాయమవటం లేదనలేదే!"

"కంక్లూజన్స్‌కి వచ్చి లాజిక్ పేర్చకూడదు"

"ప్రతీవాడూ పైవాడికి చెప్పే మొదటి నీతి అదే! ప్రీ అక్యుపైడ్ నోషన్స్ ఉండగూడదు! పార్షియాలిటీ ఉండగూడదు! ఇజమ్స్ ఉండగూడదు! వోపెన్ మైండ్ ఉండాలి! డాక్టర్‌గారూ! ప్రతివాడూ లాజిక్ ద్వారానే ఓ కంక్లూజన్‌కి వస్తాడు! వచ్చాక - కన్విన్స్ చేయటానికి - వేరే లాజిక్ చేపడతాడు - ఒప్పుకుంటారా?"

"నెగ్గటం కోసం చేసేది కుతర్కం."

"మీ కన్విక్షన్ పట్ల నాకు అగౌరవం లేదు! కుతర్కమెందుకు చేస్తాను సార్!"

"థాంక్యూ రవీ!"

"మీకథలో వాక్యాలవి... అవి సెక్స్‌ని టికిల్ చేయగలవని మీరే అంటున్నారు. మీ ఉద్దేశ్యంలో అదో సాధనం... అంతే గదా!"

"మీరు చెప్పండి... నేను వింటున్నాను."

"సెక్స్ ఉద్రేకాలకు ఎప్పీల్ చేస్తూ...సెక్స్‌ని ఎడ్యుకేట్ చేయగలరా అన్నది నా ప్రశ్న."

"...."

"ఉద్రేక పరిచి నీతులు చెప్పగలరా? శాంత పరచి నీతులు చెప్పగలరా?"

"నాకు వస్తున్న ఉత్తరాలను బట్టి నేను సక్సెస్సయానననే అనాలి రవీ!"

"నాకూ కొన్ని వేల ఉత్తరాలొస్తాయి! 70-80 శాతం ఎగ్జిబిషన్ మనస్తత్వం ఉంటుంది వాటిలో"

"నాకూ అలాంటి ఉత్తరాలు గుర్తుపట్టడం తెలుసు"

"మీకా అవకాశం తక్కువ డాక్టర్!"

"శాస్త్రాన్ని చదువుకున్నాను రవీ!"

"దాంతో రోగాన్ని కనిపెట్టగలరు! నిజమే గాని - రచయితగా అందుకునే ఉత్తరాలకు మీ శాస్త్రం చాలదు సార్! మీరు కేవలం వైద్యులు. ఎదుటి వాడి రియాక్షన్‌లో తేడాలు గమనించడం కళాకారుడి ప్రధమ విద్య. వేళాకోళాలు - ఆరాధనలు - సానుభూతి - వాంఛలు - ప్రదర్శనలు - వెర్రిమొర్రి గంతులు - అన్నీ కళాకారుడికి కరతలామలకం గావాలి. అదే వాడికి కళా ప్రదర్శనలో మెలకువలు నేర్పుతుంది."

"మీకే అర్థమౌతుందంటారు?"

"అయ్యా! మాంచి రేపరు చుట్టి కల్తీ సరుకు చెల్లుబాటు చేసే వాడికే పుచ్చుకునే నోటులో చిల్లుల గురించి భయం జాస్తి."

"మీరన్నదేదో ఆలోచించాల్సిందే"

"మీ కథ వేస్తున్న పత్రిక సర్క్యులేషన్ ఎంత?"

"లక్ష మీదే ఉండొచ్చు"

"అంటే - కనీసం అయిదు లక్షల మంది చదువుతారు మీ కథ! వాళ్ళలో ఎంత శాతం హోమోసెక్సువల్సూ, లెస్బియన్లూ ఉంటారు? ఎందరికి పెర్వర్షన్స్ ఉంటాయి? వాళ్ళ భయాందోళనలు తొలగించాలని మీ ప్రయత్నం. ఆరోగ్యవంతులకి మీరు కొత్త సమాచారం యివ్వటం లేదా - అది వారిని అనారోగ్యవంతులని చేసే అవకాశం లేదంటారా? లేనే లేదంటారా?"

"....."

"వంద మంది దోషులు తప్పించుకన్నా ఫరవాలేదు - ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదంటుంది న్యాయశాస్త్రం! వంద మంది రోగులని రక్షించలేకపోయినా ఒక్కడిని రోగిని చెయ్యరాదని వైద్యశాస్త్రం చెప్పదా డాక్టర్‌గారూ!మీరు చేస్తున్నది జ్ఞానదానమని మీ విశ్వాసం! రోగప్రదానమేమోనని నా అనుమానం"

"మీ అనుమానానికి ఆధారాలు?"

"అమ్ముడుపోయే కళా వస్తువు కళా ధర్మాన్నిగానీ, సామాజిక ధర్మాన్ని గాని నిర్వహించలేదు. దేన్నయినా వ్యాపార వస్తువుగా తూచే వ్యాపార ధర్మం మరే ధర్మాన్నీ నెత్తికి ఎత్తుకోలేదు. భారతీయ సమాజం సెక్సు అజ్ఞానం కింద మగ్గుతున్నదనేది నిర్వివాదాంశం. దాన్ని ఆకలిగా మార్చటం చిటికెలో పని! సుఖవ్యాధుల మీదా, పురుళ్ళ మీదా, రోగాల మీదా తీసిన గుప్తజ్ఞాన చిత్రాలు ఎంత కలక్షన్లు సాధించాయో మీకు తెలిసుండాలి!"

"ఇంతకన్న ఘోరంగా సెక్సుని చిత్రిస్తాయి విదేశీ చిత్రాలు. అవి ఆ సమాజంలో ఆకలిని రెచ్చగొట్టడం లేదా?"

"ఇంగ్లీషు నవలల్లో ఫోర్ లెటర్ వర్డ్స్ యధేచ్ఛగా ఉంటాయి. మంచినీళ్ళు తాగినట్లు కామాన్ని తీర్చుకునే సన్నివేశాలుంటాయి. ఎలా కాదంటాను? కాని ఆ సమాజంలో స్పెషలైజేషన్ ఉంది - ఎడల్టు హ్యూమరూ, లైట్ కామెడీ, రొమాన్సు, మ్యూజిక్కూ హిస్టరీ... దేనికదే! భూతాలూ, దెయ్యాలూ ఉంటాయి - అవన్నీ ఆ సమాజం మీద ఎంత ప్రభావం చూపిస్తాయో, ఆ సమాజ స్థితికి ఏ మాత్రం అద్దం పడతాయో మన

దగ్గర వివరాలు లేవు. కాని... అక్కడ అన్నీ దేనికవే ఉంటాయి. అభిరుచిని బట్టి, వాటి స్థాయిని బట్టి ఎంచుకునే వీలు ఉంది. మనది నవరస సిద్ధాంతం. అన్నీ ఒక దాన్లో ఉంచి అందరికీ కేటర్ చేయాలి - మనకి జుగుప్సాకరమైన సందర్భం కూడా ఉద్రేక సృష్టికి పనికిస్తుంది. ఈ స్థితిలో ఉన్న సమాజానికే మీరు అందిస్తున్న జ్ఞానం..."

"రోగమంటారు!"

"కోప్పడకండి డాక్టరుగారూ! పోనీ మీరు అందిస్తున్నది జ్ఞానమే అనుకుందాం. విపరీతంగా కథ పొడవునా సాగే టీజింగ్ ఘట్టాలూ - వర్ణనలూ - పాఠకుడిని పట్టుకోటానికీ, పట్టి ఉంచటానికే నందాం! అంత తెలిసిన మీకు దానివల్ల జరిగే నష్టం తెలియదంటే - కారణం ఏమిటి? మీరు వ్యాపారస్తులైనా కావాలి. అలా నా కనిపించదు. మీరు కళాకారుడు కాకపోవడమే కారణం!"

"మీరు నన్ను రచయితని కాదని చెప్పటానికి యింత దూరం ఆహ్వానించారు...."

"లేదు సార్! కళాకారుడు కావటం ఎంత దురదృష్టమో మీకేం తెలుసు?"

"లక్షల కొద్దీ ధనం, పేరూ, అభిమానులూ - దురదృష్టమే మరి!"

"మీ కోపం పోలేదు. కళాకారుడూ వ్యాపారస్తుడూ జనం తోటే ఆడతారు. ప్రతిఫలాలలో చాలా తేడా ఉంది. జన మోదం, జనామోదం! అదో ప్రతిఫలం! దానివల్ల తనకు కలిగే మోదం! ఇది మరో ప్రతిఫలం...! కళకి యీ రెండూ పరమావధి! అయితే కళాకారుడి ఆటకి రూల్సు జనం ఏర్పరుస్తారు! వారి అవగాహనాస్థాయే వాడి కళకి స్థాయి! వారి సంస్కారమే వాడి కళకి సంస్కారం! వ్యాపారి 'వస్తువు నాది - అవసరం నీది - కనక రూల్సు నావి - నువ్వు ఫాలో అవాలి' అంటాడు! ఇది ఆది నుంచీ వున్న కథ! ఈనాడు ఆధునిక సమాజంలో - కళ వ్యాపార వస్తువయింది! వ్యాపారం అనేకానేక ధర్మ, నీతి, న్యాయ ప్రదర్శనలతో బాటు కళా ప్రదర్శన చేస్తోంది. కళాకారుడికి తాను చేస్తున్నది కళా ప్రదర్శనో, వ్యాపారమో తెల్చుకోలేకపోవటం ఎంత దుఃఖం కలిగిస్తుంది డాక్టర్!"

"మీ మీద నా అడ్మిరేషన్ బేస్‌లెస్ కాదు"

"ఎందుకంత అడ్మిరేషన్!"

"మీ తెలివి - మీ నవలల్లో నాకు కనిపించేదదే!"

"రచనలో కనిపించాల్సింది హృదయం - తెలివి కాదు. రచనలో ఉండవలసింది తెలివి - హృదయం కాదు డాక్టర్‌గారూ!"

"కనిపించవలసింది వేరూ - ఉండేది వేరూగా ఉంటుందా?"

"ఆధునిక సాహిత్యంలో అది తప్పదు. హృదయానికి బదులు తెలివి ప్రదర్శితమయితే అది కళాకారుని అసమర్థతే! ఫెయిల్యూరే! వినూత్నంగా పాత్రలూ - అరుదుగా

సంఘటనలూ - విలక్షణంగా సంభాషణలూ - రచనలో ఉంటే నిజ జీవితంలో అలా ప్రవర్తించలేని, అలాంటి సంఘటనలు చూడలేని, అంత అద్భుతంగా మాట్లాడలేని వారికి అబ్బురంగా ఉంటుంది. వారి కళ్ళని జిగ్గుమనిపిస్తుంది. వారి బుద్ధిని భ్రమపూరితం చేస్తుంది - అప్పుడు కనపడేది తెలివే!'

"మీరేదో ఊహించుకుని బాధపడుతున్నారు. మీలో ఆర్ద్రత ఉంది. స్పందన ఉంది. సంధ్యావర్ణాలకూ, ప్రాత: సంధ్యా రాగరంజితాంబరానికీ, పూలను ముద్దాడే మంచుబిందువుకీ, కళ్ళలో రాలే వాన చినుకుకూ, మీ చూపులు ఆనని దృశ్యాలూ, మీ పదచిత్రాలకు పదును పెట్టని మనోహరవర్ణాలూ ఉన్నాయా? మీ నవలల నిండా ఎన్నో కనిపిస్తాయి! మీ హృదయ గానం వాటిలో వినిపిస్తుంది."

"యింకొంచెం పొయ్యండి. ఏమయినా తినాల్నుంది... మీరూ తీసుకోండి. థాంక్యూ సర్! థాంక్యూ?"

"మాట్లాడండి రవీ!"

"ఏం మాట్లాడాలి - నా నోటిని కట్టేసాక...."

"నేనేమన్నాను రవీ!"

"తెలివిని పొగిడితే ఈ రవిగాడు పడలేదు - హృదయముందనే సరికి... పాపం! యిష్టమయిన పొగడ్తగదూ... పడ్డాడయ్యా పడ్డాడు"

"పడుకుంటే మంచిది... రవీ!"

"అమ్మమ్మ ఎంతమాటన్నావు గురువా! ఏనాకొడుకొచ్చి నన్ను సుట్టబెట్టి నెట్టేసి నా యీ స్వర్ణ సింహాసనాన్ని లేపుకుపోతాడో ... అమ్మో! నిద్రే!"

"ఓ వైద్యుడిగా మీ టెన్షన్స్ అర్థమవుతాయి రవీ!"

"ఆటిమీద బతికి బట్టకట్టే వోడివి - నువ్వు! నీ కడుపు నింపేది నా టెన్షన్స్! నా మెంటల్ ఎగొనీ! నా పర్వర్షన్స్! గుండె మీద చెయ్యేసుకు చెప్పు డాక్టరూ!"

"మీరా కాస్త తినేస్తే - రామూని పిలిచి తీయిస్తా - పడుకుందాం!"

"నాకు వినే మూడ్ లేదు! నిజింవే - నీకూ?"

"చెప్పండి"

"ఓ సిన్న సీక్రెట్! నువ్వు జ్ఞానాన్ని సెక్సు రేపరులో యెట్టి పంచుతున్నాననుకుంటున్నావు! ఓరి ఎర్రోడా! ఆడు నీ ఎగోకి జ్ఞానం రేపరు చుట్టి నీ సేత వస్తువు పుట్టిస్తున్నాడంటాను! పెజలకి ఏది కావాలో ఎంటపడి పట్టుకునే జమా జట్టీలున్నారు! అయి, ఎవడికాడ దొరుకుతాయో - ఆడు ఏ రేపరేసి, ఏటిస్తే - ఆటిని సప్లయి జేత్తాడో కనిపెట్టే జమాజట్టీలున్నారు. నానూ ఒహప్పుడు యమా గీరగా బోర యిరుసుకుని యిప్లవాన్ని

జిందాబాదన్నవోడినే! నాటకాలు గట్టి జనాలకి చూపెట్టినాడినే! ఏ గాడిద కొడుకు నన్ను పట్టించుకున్నాడు?

"నేనంటే జండా కొయ్య పట్టుకోగల్దునుగాని ఉరికొయ్య పట్టుకోగల్నా! నా మెంటల్ మేకప్ నాది! నా భయాలు నాయి! తీరా నేను నా యిట్టమొచ్చినట్టు రాస్తే ఏసేవోడెవడు? ఒహప్పుడు సొతంత్రం ఊపు! అప్పుడు అది అమ్ముడయీది! అమ్మారు! రాతకి రూలుసు ఒకటే! వొస్తువు ఏదయినా సెల్లీది! రిచ్చావోడి బాధలూ, సానుల కన్నీళ్ళూ మిడిల్ క్లాసుకి సమ్మగా ఉండేవి! అడు తన్ను తానో పేద్ద దయాసముద్రుడిలా సూసుకుందుకు వతనుగా ఉండేయి! ఆటినే యీ కమ్మూనిస్టోళ్ళు – యియ్యేనండీ కథలంటే – అని నమ్మించారు! నా బోటి కుర్రగుంటలం – ఉద్యోగాలు దొరకని వోళ్ళం – దొరికిందాంతో కనిపించేయన్నీ కొనలేక – కొనలేకపోడమే పెపంచకంలో పెద్ద బాధగా గోలపెట్టీవోళ్ళం – ఆ కథల్ని ఆరాధించేసినాం!

"తీరా మనం కూసుని రాయబట్టీసరికి ఏటయ్యింది? సొతంత్రం ఊపు ఎప్పుడో ఎగిరిపోనాది! ఆకలీ, కేకలూ సదూకునీ జనాలకి సరదాలే గాని, సావూ బతుకూ గావు! సావూ, బతుకూ తేల్సుకోవాలంటే గన్నట్టుకుని అడివికి పో! సరదాలు తీరుస్తానంటే పెన్నట్టుకుని అమ్ముడుపో! తేల్చుకోమంది బతుకు!

"యిదేటిది? నాను కళాకారుడిని! నా కిట్టమొచ్చింది రాయలేనా? గురుడా! రాసేవోళ్ళంతా, పాడేవోళ్ళంతా, ఆడేవోళ్ళంతా కళాకారులనుకోకు! గందోళీగాళ్ళుంటారు! నమ్మిందాన్ని వంద రకాలుగా వెయ్యి కతలుగా రాసి జ్ఞానబోధ సెయ్యబట్టినోళ్ళుంటారు! ఒక్క రోజు రాయకపోతే... ఒక్క రోజు గజ్జె కట్టి కాలు కదపకపోతే – కొత్త రాగం కోసం ఒక్క రోజు స్వరం తన్నుకోకపోతే – అదే సావుగా సచ్చిపోయీ దురదృష్టపు జాతకంగాళ్ళుంటారు!"

"ఆళ్ళకి జనం కావాలి! జనం తల ఊపు కావాలి! జనం మారాలి! కళాకారుడిని మార్చాలి! పాటగాడి బతుకు ఏరు! ఆటగాడి తిత్తవ ఏరు! రాసీవోడి కత ఏరు! మద్దెన పత్రికలున్నాయి! పుస్తకాలు యేసేవోళ్ళున్నారు! ఆళ్ళెలా బతుకుతారు? అయెలా పుడతాయి! పెట్టుబడుంటే పుడతాయి! రాబడి వుంటే నిలబడతాయి! రాబడి ఎలా ఉంటుంది? కొంటే – ఎందుక్కొంటాడు? – వాడికి నచ్చేదుంటే ! ఆడికి నచ్చేది నువ్వు రాయి! అది రాస్తే నీకు కళ అవదు! నీ కళ నిన్ను బతక నివ్వదు!

"నీ బతుకు నీ కళకు బతుకివ్వదు! రాసిందాన్ని బొక్కసాల్లో కుక్కేసి ఉండలేవు! నేను అమ్ముడుపోతున్నానని కత రాసాను. నువ్వెందుకు అమ్ముడుపోతున్నావు – దేన్ని అమ్ముతున్నావని – యీనాడు నా అభిమానులమనే వోళ్ళలో ఒక్కరు నన్ను అడగలేదు!

అప్పటికి హ్రిదయం మాంచి గిరాకీలో ఉంది. ఆడపిల్లల సుందర స్వప్నాలకి తాజా తాజా వేడి వేడి సుందర సున్నిత కర్కశ హీరోలని వండి జనాలకి పెట్టాయి రచనలు. వాళ్ళని ఏడిపిస్తూ కాస్త భయపెడితే ఎలాగుంటుందని బయల్దేరాను. చావు పేలిందా - భూతాలు పేలాయా అన్నది పెద్ద డైలమా! 'రెండూ పాపాలేరా' అనేది కళ! నన్నేటి సెయ్యమంటావు! నేను సావలేను! నిన్ను సంపలేను - అన్నాను. ఆ తరువాత ఏటయినాది - నా కళ జబ్బు పడింది... జబ్బు...జబ్బు!!!"

"రవీ! రవీ! ప్చ్! నిద్రపోయినట్టున్నాడు!"

**-3-**

"నిద్రాభంగమయిందా?"

"రెండింటి దాకా మాట్లాడుతున్నారు. నాలుగింటికే మెలకువ వచ్చేసిందా రవీ?"

"మిమ్మల్ని యిబ్బందిపెట్టానా రాత్రి?"

"నన్ను దోవలో పెట్టడానికి తెలివంతా ఉపయోగించారు. సంతోషం."

"మిమ్మల్ని అర్థం చేసుకోవాలనే నా ప్రయత్నం! మన యిద్దరి వల్లా జరుగుతున్నది ఒకటేనని నా అనుమానం! మనస్తత్వ శాస్త్రాన్ని గూర్చి నేను నవలల్లో ఏం కూసినా, నా మనస్థితి నాకు అంతుపట్టలేదు. అన్నీ తెలిసిన మీరూ నా స్థితిలో ఉంటే - నాకు ఉపకరిస్తారనుకున్నాను. మీరు ముసుగులు లేవంటున్నారు. నాకు మాత్రం ఉన్నాయి. నేను కళాకారుడిని. నేను మనిషిని. నేను వ్యాపారిని. నేనేదయినా మిగిలిన రెండూ ముసుగులు నాకు"

"చెప్పండి రవీ!"

"తను జీవిస్తున్న జీవిత విధానంపట్ల గౌరవమూ, తృప్తీ లేనివాడి కన్నా దురదృష్టవంతుడు లేడని ఈ మధ్యనే నేనొక చోట అన్నాను"

"మీ ధోరణి సైకాలజీ ప్రకారం ఏమంటారంటే....."

"క్షమించండి డాక్టరుగారూ! ప్రతి ధోరణికీ ఏదో రోగం పేరుపెట్టే ధోరణిని మాత్రం నేను వ్యాపార ధోరణి అంటాను. భూమి మీదనున్న సమాజాలు అన్నిట్లోనూ మానసిక రోగాలు ఒకటే అయే అవకాశం ఉందంటే నేను నమ్మలేను! మీరన్నట్టు నాది రోగమే అయితే చికిత్స ఉంటే - తప్పక చెయ్యండి."

"రవీ! మీరు ఆవేశంలో వున్నారు మీ ఆవేశాలు ఎంత అప్రధానమైనవో...."

"ముందు నన్ను చెప్పనీండి! మీకు నిద్రొచ్చినా వింటున్నట్టు నటించండి!"

"చెప్పండి"

"ఒకప్పుడు నీకిష్టమయినదేంటని ఎవరయినా అడిగితే వెంటనే చెప్పేవాడిని! - నా

కుడిచెయ్యి! బస్సులోనో, స్కూటర్ మీదో కూర్చున్నపుడు ఏక్సిడెంట్ జరిగితే - యీ చేతిని ఎలా కాపాడుకోటమాని బుర్ర ఆలోచించేది! ఇప్పుడు? ఇది క్రష్షయిపోతే - నా ప్రమేయం లేకుండా ఊడిపోతే ! డాక్టరుగారూ! ఆ ఊహ బుర్రలో కదిలితే భయం! ఆ అలజడి వర్ణనాతీతం!

"మాది వంశధార దగ్గర ఓ కుగ్రామం! పదకొండు మంది సతానంలో నేను తొమ్మిదోవాడిని! మాకు బాగా ఆస్తిపాస్తులుండేవి! నాన్నగారికి నాటకాల సరదా! గిరజాలు పెంచుకుని, చుట్ట బిగించి వీధరుగు మీద కూర్చుని కబుర్లు చెప్పేవారు. పెళ్ళి పంక్తిలో ఆయన పద్యం ఎత్తితే తతిమ్మా వాళ్ళ చేతులు ఎండిపోయేవి. ఎప్పుడూ పదిమంది మధ్య ఉండే ఆయన రూపం నా కిప్పటికీ గుర్తే!

"ఉంటే - ఆయనలా ఉండాలి - సెంటరాఫ్ అట్రాక్షన్ అవాలన్న యింప్రెషన్ నా బాల్యంలోనే నాలో నాటుకుంది. ఏదయినా సరే స్వతంత్రంగా చెయ్యాలన్న తత్వమూ ఆయనదే!

"హఠాత్తుగా ఓ రోజు ఆయన మాయమయిపోయారు.

"మేమంతా వీధిలో పడ్డాం! మా పిన్ని భర్త వచ్చారు. యిల్లూ వాకిలీ తీసేసి అప్పులు చెల్లగొట్టి కాకినాడ తీసుకుపోయారు. మునిసిపాలిటీలో ఆఫీసరు. అయినా పైసా లంచం ముట్టలేదు. పర ధనాన్ని ముట్టరాదన్నది ఆయన లక్షణం. మా నాన్నగారి తమ్ముళ్ళే ఆయన్ని దగా చేసారు. మా యీ చిన్నాన్న పెద్దన్నయ్యకు ఉద్యోగం, ముగ్గురక్కయ్యల వివాహం చేసారు. మనిషి అంటే అంత ధర్మంగా ఉండాలి - అన్న భావం ఆయన కలిగించారు.

"అరవై మూడులో ఆయన పోయారు. ప్రైవేట్లు చెపుతూ బియ్యే చదువుతున్నాను. ఛందస్సులో పద్యాలు రాసేవాడిని. దేశభక్తి, ప్రేమ, తల్లి మమత... బియ్యే అయిందనిపించాను. రికామీగా తిరుగుతున్న నన్ను ఓ దూరపు బంధువు హైదరాబాద్‌లో ఆశ్రయమిస్తానంటే వెళ్ళాను. ముల్కీ - నాన్ ముల్కీ గొడవలు, హిందూ ముస్లిమ్ తగాయిదాలు నన్ను కలవరపరిచాయి. చిక్కడపల్లిలో లైబ్రరీకి వెళ్ళి వస్తున్నప్పుడు ఓ స్నేహితుడు పరిచయమయాడు. అతని ద్వారా కమ్యూనిస్టు భావజాలంతో పరిచయమయింది.

"కమ్యూనిజం గురించి నేను రెండు అనుకున్నాను - యీ ప్రపంచమంతా ఒక సిస్టమెటిక్‌గా మారుతోంది. వేర్వేరు దేశాల్లోని పరిస్థితులూ, చైతన్య స్థాయీ యీ మార్పు వేగాన్ని కాస్త ముందూ వెనుకా చేయగలవుగాని మార్పు తప్పదు. ప్రపంచమంతటా సమ సమాజం ఏర్పడక తప్పదు. రెండవది వ్యక్తి గురించి. వ్యక్తి సహజ శక్తులు సంపూర్ణంగా

ఆ సమాజంలోనే వికసిస్తాయి. మత భేదాలనూ, ప్రాంతాల మధ్య అసమానతలనూ యీనాటి సమాజంలోని పాలక వర్గాలు పాలితులను ఏకం కాకుండా ఉపయోగించు కుంటున్నాయి. వ్యక్తిని అజ్ఞానానికీ, విద్వేష భావాలకూ కేంద్రంగా చేస్తున్న యీ సమాజం మారాక వ్యక్తి సహజంగా జీవించగలుగుతాడు.

"రెండేళ్ళు అనేక చిన్న చిన్న ఉద్యోగాలు చేసాను. నా మొదటి కథ జయశ్రీలో 'రాజు – మహిషి' వెనుక పేజీలో అచ్చయిన రోజును మరిచిపోలేను. శ్రీశ్రీ, దేవులపల్లి, వేదులా, జంధ్యాలా... వరుసగా పద్యాలు చదవకుండా నిద్ర పట్టేది కాదు. లేచి ముహం కడిగేవాడిని కాదు. వాటి సొగసూ, ధారా నన్ను పట్టేవని యిప్పుడనిపిస్తోంది. వాటి అన్నింటి మీద సమానమైన యిష్టముండడం నాకు ఆ నాడు తప్పుగా ఉండేది. తప్పు అని ఎవరూ నాతో అనలేదు. కమ్యూనిస్టు అయినవాడు ఛందస్సుని పట్టుకోవటమేమిటి అనిపించేది.

"నేను ఓ కంపెనీలో స్టెనో నుంచి పెర్సనల్ అసిస్టెంట్‌గా మారాను. పెళ్ళయింది. ఆమె చాలా అనుకూలవతి. కాని జీవితంలో ఏదో మిస్సయినట్లనిపించేది – నాన్నగారిలా సెంటరాఫ్ అట్రాక్షన్ కాలేకపోయాను. చిన్నాన్నగారిలా ధర్మమూర్తి కాలేకపోయాను. వివాహానికి ముందు ఏర్పడిన ఓ కామానుభవం నేను నేనులా ఉండలేకపోయానన్న కించాభావం కలిగించేది. రొమాన్సులేని వివాహం చేసుకున్నాను. వీటన్నిటికన్న నేను నమ్మిన కమ్యూనిజానికి నా వంతు నేను ఏం చేయాలన్న బాధ నన్ను తినేసింది.

"పద్యాలను అటకెక్కించి కథల మీద పడ్డాను. కథా వస్తువులకు నాకు ఎన్నడూ కొరత ఉండేది కాదు. కాని ఏది కమ్యూనిస్టు భావ ప్రచారానికి దోహదపడుతుంది? ఏది దానికి వ్యతిరిక్తమవుతుంది? – అదే ప్రశ్న.

"అప్పటికి దిగంబర కవులు వచ్చారు. విరసం ఏర్పడింది. నా కథలలో కమ్యూనిస్టు భావాలుండేవి. అయినా నినాదాలుండేవి కావు. నేను అందరిలాగా ఎందుకు ఉండలేనో నాకు తెలిసేది కాదు. రావిశాస్త్రిగారూ, కొకూ, కారా, ముప్పాళ్ళ, పెద్దిభొట్ల, లతని విపరీతంగా ఆరాధించేవాడిని. వాళ్ల మధ్య తేడాలు అర్థమవుతూ కూడా అందరూ నా కెందుకు నచ్చేవారు? అయినా ఎవరినీ అనుకరించకూడదు. మరెలా రాయాలి?

"ఆ అయోమక దశలో నేను కొన్ని నవలలు రాసాను. కోడూరి, యుద్దనపూడి, మాదిరెడ్డి లాంటి వారు నవల రాయటం బ్రహ్మవిద్య కాదని నిరూపించేసారు. నవలలకు ప్రత్యేకమైన పాఠకులు ఏర్పడుతున్నారు. నా నవలలో కమ్యూనిస్టు భావాలుండేవి. కానీ అందులో ఒకటీ ప్రచురింపబడలేదు. ఓడిపోతున్నాననిపించేకొద్దీ కృంగిపోయాను. శిల్పం లేదా? చదివించే గుణం లేదా? నా అభిప్రాయాలకు యీ నవలా ప్రక్రియ వాహిక గాదా? – వెయ్యిన్నొక్క అనుమానాలు. అనేక రకాలుగా మార్చి మార్చి వ్రాసాను.

"ఏడవది నా జీవితాన్ని మార్చిన నవల. అది నా గురించి నేను రాసాను. కథా నాయకుడు తనని తాను వంచించుకుంటున్నావన్న స్పృహతో లోకాన్ని వంచించుతాడు. విజయం సాధిస్తాడు. అది రాసాక ఆరు నవలలూ కాల్చేసాను. తిరిగి వస్తే అదీ కాల్చేసే వాడినే! అచ్చయింది. ఆ నవల. అంతకు ముందు వాటికన్నా రచనా విధానంలోగాని సన్నివేశ కల్పనలోగాని సంభాషణా చమత్కారంలోగాని భిన్నమయింది కాదు. నాలో కళాకారుడు వేరూ మనిషి వేరూ అని నేను గుర్తు పట్టగలిగాను. కళాకారుడి పని కళాప్రదర్శనే, మనిషిగా తన విశ్వాసాలకూ, కళకూ సంబంధం లేదు అన్న లాజిక్‌తో నేను సర్దుకున్నాను. రాతలో రచనలో కనిపించని లోపాలెన్నో అచ్చులో కనిపించేవి.

"అప్పుడు వర్తమాన పత్రికలనూ, వస్తున్న రచనలనూ ఎనలైజ్ చేసాను. పాఠకుల స్థాయి గురించి ఓ అంచనా దొరికింది. నేను ఏదయినా రాయగలను - ఫలానిదే రాయాలన్న నా పట్టుదలే నాకు అవకాశం లేకుండా చేసింది - అనుకున్నాను. దాంతో నాలో కళాకారుడు ఆవురావురుమంటూ రాసి తృప్తిపడసాగాడు. అవి జనాలు అవురావురుమంటూ చదవసాగారు. నేను ఒరవడినయాను. నా కన్నతండ్రి యింప్రెషన్స్ చిన్నతనానివి. స్వతంత్రంగా రాసి, సెంటరాఫ్ అట్రాక్షన్ సంపాదించుకున్నాను. కాని నా ఫార్మేషన్ దినాలలో పన్నెండు సంవత్సరాల కాలం తన త్యాగనిరతితో, ధర్మప్రవర్తనతో వ్యక్తి తనకు తాను ఎంతగా బాధ్యుడో తెలియజెప్పిన మా చిన్నాన్న నన్ను నిలదీసి అడిగేవారు. నాలో మనిషిని ఆయన జ్ఞాపకాలు కుదిపేసేవి! నేను రాసిన నవలలో ఏది అమానుషంగానూ, సామాన్య మస్తిష్కాలకు అపాయకరంగానూ నాలో మనిషి చూపించేవాడో అది తర్వాత నవలలోకి రాకుండా జాగ్రత్తపడేవాడిని. ఒక్క తప్పును కేవలం మూడింటిలో రిపీట్ చేసాను. వాటికి పరిహారంగా నా నవలల మీద నేనే పేరడీలు రాసాను.

"సెంటరాఫ్ అట్రాక్షన్ కలిగించే మత్తూ, ఆర్ట్ ఫర్ సేక్ అన్న తర్కమూ నాలో మనిషిని నిద్రపోగొట్టగలిగినా కమ్యూనిజం గురించి నా భావాలూ ముఖ్యంగా నాకు అసరా అయేయి!

"మంచయినా చెడ్డయినా దానిలో వ్యక్తి కన్న వ్యవస్థే ముఖ్యమైనదంటుంది కమ్యూనిజం. ఈ వ్యవస్థలో నేనున్నంత కాలమూ నేను ప్రవాహంలో బిందువుని! యిది పోయి పోయి ఏ అవరోధాలనో బద్దలుగొడితే నాకూ విముక్తి దొరుకుతుంది. ఈ భావన శ్రీశ్రీ లాంటి వాళ్ళ మాటల్లో నేను చూసేవాడిని.

"చేసేది లుచ్ఛా పనే అయినా - అలా నేను గుర్తించగలిగినంత కాలమూ దాని కర్తృత్వం నాకు అంటదు - అని ముసుగేసుకున్నాను.

"మా చిన్నాన్న వ్యక్తిత్వ ప్రభావం నన్ను కొన్నేళ్ళు అంపశయ్య మీద పడుకోబెట్టినా ఓ సుఖ లాలసతో, కుతర్కంతో, కమ్యూనిజం గూర్చి తప్పో ఒప్పో తెలీని యీ అవగాహనతో రాసుకుంటూ పోయాను.

"వేలాది మంది అభిమానులు, వెంటబడే సంపాదకులూ, ప్రచురణకర్తలూ, ధనం, పేరూ, సమస్యలు లేని సంసారం.. నా రథయాత్ర నిర్విఘ్నంగా సాగింది.

"సరిగ్గా అలాంటి సమయంలో నాలో మూడో మనిషి, కనిపించసాగాడు.

"వాడు నాలో వ్యాపారి.

"వాడు నాకు చెప్పిన మొదటి విషయమేమిటంటే – యిప్పుడు అమ్ముడు పోయేది నీ వస్తువు కాదు – నీ పేరు అన్నాడు. అది నేను నిర్ధరించుకున్నాక అన్నాడు – 'ఆ పేరు నీ పెట్టుబడి. నీ కళగాదు'

"కొన్నాళ్ళు నేనది భరించలేకపోయాను. ఆ పేరు ఏమిటి? రవి చెల్లే పదార్థమని గదా! రవి చెల్లే పదార్థంగా ఉండాలంటే రవి చెల్లే పదార్థాన్ని ఉత్పత్తి చేయాలి! నీ వస్తువు మీద నిర్ణయాధికారం నీకు లేదు! డిమాండ్‌ని బట్టి సప్లయి చేయాల్సిందే! నీ అంతరంగిక యిచ్ఛని అనుసరించి నువ్వు రాయకూడదు! యీ విషయం అర్థమయిన కొద్దీ నేను పిచ్చెత్తిపోయాను.

"ఆ దశలో నా యిచ్ఛ మీద ఒకటీ, డిమాండ్‌ని బట్టి ఒకటీ రాయబోయాను. కానీ నా యిచ్ఛ మీద రాసేది 'ఆ పేరును 'ఆ పెట్టుబడి'ని నాశనం చెయ్యొచ్చనీ, నన్నంతా రిటనాఫ్ చేసేస్తారనీ నాలో వ్యాపారి నన్ను భయపెట్టసాగాడు. నా యిచ్ఛతో రాస్తున్నది కూడా నేను పొల్యూట్ చేస్తున్నానని అర్థమవసాగింది.

"నాలో కళాకారుడికీ, వ్యాపారికీ బొత్తిగా పడడం మానేసింది. నాలో మనిషిని కట్టుబానిస చేసుకోగలిగాడు కళాకారుడు. ఆ కళాకారుడిని కూలివాడుగా మాత్రం చేసుకోగలిగాడు వ్యాపారి. కళాకారుడు నాలో మనిషి మూల పడితే సంతోషించలేదు. వ్యాపారి మాత్రం విజయగర్వంతో నన్ను కృంగదీస్తున్నాడు. నా రచన ఒకప్పుడు నాకు విజయ సంకేతం. ఇప్పుడది ఓ సాధనం!

"నాలో కళాకారుడిని 'విజయభావన' అనే కూలి యిచ్చి పని చేయిస్తున్న వ్యాపారికి … భయం…అభద్రత…పోటీ… అవి సరిపోయాయి నన్ను ఊడిగం చేయించటానికి!

నేనిప్పుడు రాస్తున్న నవల గురించి వాడన్న మాటలు నన్ను మీ ముందు కూర్చోబెట్టేయి డాక్టర్!…"

"చెప్పండి రవీ!"

"యిదంతా ఉపోద్ఘాతం! యిది చెప్పాక యింకేం చెప్పాలనిపిస్తుంది?"

"మీ మనసులో ఉన్నదంతా చెప్పండి రవీ!"

-4-

"మూడేళ్ళ క్రితం ఒక అంతర్జాతీయ పత్రికా వ్యాపార సంస్థ తెలుగులో పత్రికారంగం గుర్చి ఒక సర్వే జరిపింది. అక్షరాస్యత, పాఠకుల మేధో పరిమితులూ, మానసిక బలహీనతలూ, రచనా ప్రక్రియలూ, కొనుగోలు శక్తీ పట్టణాలూ పల్లెల పాఠకుల సంఖ్యా, ప్రభుత్వ ప్రమేయం... వంటి అనేకానేక వివరాలను వాళ్ళు సేకరించారు. అందులో భాగంగా నాలాంటి వాళ్ళను ఇంటర్వ్యూ చేసారు. ఆ సర్వే వివరాల్లో కొన్ని ఒకటి రెండు ఆంగ్ల పత్రికలలో వచ్చాయి.

"వాళ్ళు పెట్టిన పత్రికలో వస్తోంది నా ప్రస్తుత నవల. నవలలకి ప్రత్యేకంగా ఒక అడ్మినిస్ట్రేటివ్ మానేజర్‌ని నియమించారు. మీకింకా యీ పత్రికతో పరిచయం లేదు. ఆ మేనేజర్‌కీ నాకూ ఒరే ఒరే అనుకునే స్నేహం! నా నవల మొదలయిన ఆరో వారంలో నన్ను కలిసాడు వాడు.

"ఇన్‌స్టాల్‌మెంట్ కోసం వాడు రానక్కరలేదు! పాఠకులతో నాకు నేరుగానే సంబంధాలున్నాయి. వాళ్ళు నాకు నేరుగానే రాస్తారు. వాళ్ళ రియాక్షన్ బట్టి ఏ మలుపు తిప్పాలో, ఆ ఇన్‌స్టాల్‌మెంట్లో ఏం కలపాలో నేనే చూసుకునేవాడిని. ఈ నవల గురించి నేనూ వాడూ ముందుగా ఒప్పందాలు చేసుకున్నాం. ఇంత వరకూ సెక్సు నేను బట్టలుంచి రాసాను. ఇందులో కొంచెం విప్పాలనే నేనూ అనుకున్నాను. ఇంగ్లీషులో రాస్తే దానికి సెక్సు వాసన తగ్గుతుందని కొందరు అనుకుంటే - సంస్కృత పదాలు దట్టిస్తే అంత అబ్సినిటీ, వల్గారిటీ ఉండవని కొందరనుకుంటారు! సంబంధముండదగ్గ పాత్రల మధ్య సెక్సు ఉంచితేనే తెలుగు పాఠకుడికి పడుతుందని కొందరు అనుకుంటే - టాబూస్ ఉండే పాత్రల మధ్య, వృద్ధుల మధ్యా ఉండేది తప్పించి, మరేదయినా తెలుగోడు చప్పరిస్తాడని కొందరనుకుంటారు. యిలా అంతా అనుకుంటారని నేను అనుకుంటాను. కనక వ్యాపారీ, కళాకారుడూ నాలో ఎంత పెనుగులాడినా నా రచనను అటూ యిటూ ఎంత లాగినా ఇదంతా నా వ్యాపార దక్షత మేరకే - నా అధీనంలోనే సాగుతోందని - నా ప్రగాఢ విశ్వాసం.

"వాడా రోజున సూటిగా అన్నాడు - 'నువ్వు రాస్తున్నది చాలదూ' అని. నేను నోరు విప్పేలోగానే - 'బూతంటే నువ్వు రాసింది గాదు - యీ పత్రికలు చదువు - నాకేం? రేపు పావలాకి చెల్లవు నీ పుస్తకాలు' అన్నాడు.

"నాకు లక్షలాది మంది అభిమానులున్నారు. వాళ్ళకి నువ్వు చెప్పే బూతు అక్కరలేదు. నేను రాసింది చాలు!" అన్నాను.

"నీ నవల అడ్వర్టైజ్ చేసాక పదివేలు పెరిగింది సర్క్యులేషన్! నవల మొదలయాక యిరవై ఆరు వేలు పెరిగింది! అది స్టడీగా మూడు వారాలుంది! తర్వాత క్రమంగా తగ్గింది"

"ఎంత?"

"ఆ లెక్క నీ కనవసరం"

"నేను అంత బూతు రాయటాన్ని జనం భరించలేకపోతున్నారు"

"పూర్తిగా మానెయ్యి! పెరిగిపోతుంది నా సర్క్యులేషనూ, నీ డిమాండూ"

నేను కంగుతిన్నాను.

"జనమేమనుకుంటారో తెల్సా రవీ! రవిగాడికి నలభై దాటి ఏభైలకి దగ్గరవుతున్నాడు! గురుడికి ఉడిగి పోతోంది! చాతకావటం లేదు! ఈ నవలదేముంది? ఒప్పందాల ప్రకారం నువ్వు నీ యిష్టమొచ్చినట్టు రాయొచ్చు. నేనింకో దాంతో కాంపన్సేట్ చేస్తాను! ఓ మారు డౌనయిపోయావంటే - నీ ముఖమెవడూ చూడడు!"

"వాడు వెళ్ళిపోయాడు. ఆ వేడిలో మీకు ఫోన్ చేసాను డాక్టర్!"

-5-

"రవీ! నేనో సలహా చెప్పనా?'

"అక్కర్లేదు! నాకు సలహాలు వినటం యిష్టముండదు డాక్టర్!'

"నవల గురించి కాదు రవీ!"

"డాక్టర్! నన్నిన్నాళ్ళూ కవర్ చేసిన కమ్యూనిస్టు ఊహలకి గడిచిన ఏడాది నుంచీ తూర్పు యూరోప్ రష్యాలలో మార్పులు - పెద్ద దెబ్బ కొట్టాయి! మీకది అర్థమవుతుందా?'

"ప్రయత్నిస్తాను చెప్పండి!"

"యిన్నాళ్ళూ నేను నా నవలల్లో యువకులకు నప్పుతుందన్న దృష్టితో - మీ స్వయంకృషీ, మీ తెలివీ, యీ లోకంలో మీ స్థానాన్ని నిర్ణయిస్తాయని రాసేవాడిని! అది నిరుద్యోగ విద్యావంతులకు పేలుతుంది గనకే అన్నాను! నా మటుకు నేను వ్యవస్థ బలమైనది - నా యిచ్చకొద్దీ జీవించే అవకాశం నాకు లేదు - విప్లవం వచ్చాకే నేను మారగలను అని కవర్ చేసుకునేవాడిని! ప్రపంచంలో వస్తున్న మార్పులు నేనెంత పట్టించుకోకూడదన్నా నన్ను వదలటం లేదు!"

"కమ్యూనిజాన్ని నేను ఎప్పుడూ పట్టించుకోలేదు - రవీ"

"నా యవ్వన దశలో ఆ వేడిలో అది నాకు పట్టింది! అది నాకు యీ నాటి దాకా కవర్‌గా వినియోగపడింది. ఈ రోజు ఆ మానేజర్ మాట అన్ని ముసుగులూ తీసేసి వీధిలో నిలబెట్టింది. నా చేతకానితనానికి, నా మానసిక నపుంసత్వానికి... నేనే కర్తనట!

వాడు నన్ను అవమానించలేదు. నేను అనుకుంటున్నదే, నేను పైకి అనలేకున్నదే వాడు అన్నాడు. వాడి దృష్టి వేరు. వాడికి నాలో కావాల్సిన రియాక్షన్ వేరు. నాకు కలిగిన బాధ వేరు! కమ్యూనిజం, వ్యవస్థలూ, వ్యక్తి నిర్ణాయక శక్తీ.. అన్నీ వ్యర్థమనే అనుకుందాం. ఇన్నాళ్ళూ నేనేం చేయగలను - అంతా యిలా ఉంటే అనుకున్నాను. యిప్పుడు నా పనులకు నేను కాకపోతే ఎవరు బాధ్యులు? అన్న ప్రశ్న నన్ను పొడుస్తోంది.

"నాలో వ్యాపారి వ్యాపార విజయాలే కళా విజయాలకన్న, మానవ సంస్కారాలకన్న మిన్న అంటున్నాడు. నన్ను నాశనం చేస్తున్నాడు. ప్రతిక్రియగా 'నేను' అనే దానిని, 'నాది' అనే దానిని నాశనం చేయాలని, విధ్వంసం చేయాలని... నా టేబిలుని, నా ప్రాణప్రదమైన కలాన్ని నా యీ కుడిచేతిని...'

"రవీ! రవీ! ప్లీజ్! ఆవేశపడకండి"

"నాకు భయంగా ఉంది. నాదేం రోగం? దానికి చికిత్స ఏమిటి? డాక్టర్! నన్ను గురించి ఆలోచించండి.. రోగమయితే చికిత్స చేయండి... గుడ్‌నైట్! పడుకుందాం"

-6-

"డాక్టర్ సాబ్! రవిగారు వెళ్ళిపోయారు. ఈ కవరు మీకిమ్మన్నారు - మిమ్మల్ని లేచీదాకా లేపొద్దన్నారు."

"..."

"అదేంటిసార్! ఏముందా ఉత్తరంలో!"

"రవి ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసాడు. వెంటనే వాళ్ళ యింటికి ఫోన్ చెయ్యాలి!"

"...సాబ్! రవిగారికి ఏమీ అవలేదు. ఫోన్ మీద వున్నారు - మిమ్మల్ని కంగారు పడొద్దన్నారు"

"ఏంటి సార్ - యీ ఉత్తరం?"

'నేను కళాకారుడిని డాక్టర్! ఆత్మని ప్రస్తుతానికి హత్య చేసుకున్నా'

'యిలాంటి ఆలోచన రానీకు నేస్తం'

'నాలో యింకా పుంస్త్వముంది మిత్రమా! నా సమస్యకు పరిష్కారాన్ని నేనే సాధించుకోగలను! డిస్ట్రక్షన్ కన్న కన్‌స్ట్రక్షన్ కష్టమే గావచ్చు - కాని నేనది సాధిస్తాను! బెంగాలీ మహారచయిత్రి లాగ ఒక్క రాత్రిలో నేను మారిపోతాను! నన్ను నేను జాగ్రత్త చేసుకుంటాను!నిర్మించుకుంటాను! నా స్వాతంత్ర్యాన్ని నేను సాధించుకుంటాను! నా మనస్సు ఫీలయినదాన్ని, నా బుద్ధి చెప్పాలని భావించిన దానిని చెప్పి ప్రపంచంలో జరుగుతున్న భావాల సంఘర్షణలో నా పాత్ర నేనూ నిర్వహిస్తాను!

ఆనాడు శ్రీశ్రీ ఏ దృష్టితో అన్నా నేను మరో దృష్టితో ఈనాడు అంటున్నాను.



నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!

నేను సైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలుపోతాను!

నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!

## కథాప్రవాళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

'అద్వైతం' కథలో విషయం క్లిష్టమయినది. అయినా అనేక కోణాల నుంచి విమర్శలుచేసారు పాఠకులు. 'నేను సైతం'లో విషయం దానితో పోలిస్తే సరళమయినదే! అయినా పాఠకుల స్పందన అంతగా లేదు.

కారణం ఏమిటయి ఉండాలి?

సంభాషణా కథనాన్ని అన్వయించుకోలేకపోయారా! ఇలాంటి కథనం అరుదే గాని కొత్తది కాదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు మధ్య తరగతి బ్రాహ్మణ దంపతుల సంభాషణతో కథ వ్రాసారు. వారి మధ్య వేళాకోళమూ, మార్మికతా చదువరికి రమ్యంగా ఉంటాయి. ఆ దంపతుల పరిస్థితి, స్థితీ పాఠకులకు అందుతాయి. అలా అందటానికి రచయిత సామర్థ్యమూ, విషయ సౌలభ్యమూ కారణాలే అయినా పాత్రలకూ, పాఠకులకూ మధ్య జీవిత సామీప్యత్య కూడా ఓ ముఖ్య కారణం.

అంటే -

పాత్రల జీవితమూ, మనస్థితీ, సమస్యా ఎంత సాధారణంగా ఉంటే అంతగా సాధారణ పాఠకుడు తన అనుభవంతో అన్వయించుకోగలుగుతాడు.

'నేను సైతం'లో పాత్రలు రెండూ రచయితలు. వారి సమస్యా, ఆవేశాలతో పాఠకుడికి తగినంత పరిచయం ఉంటే - ఆ పాత్రల సంభాషణా, వారి ఆవేశ స్థితి అన్వయించుకోవటం సులభమయేది. అలా జరగలేదంటే 'రచయిత'లు ప్రత్యేక వ్యక్తులు అవటమూ, వారివి 'ప్రత్యేక సమస్యలు' అవటమూ కారణమయుండాలి.

తమాషా ఏంటంటే -

వారం వారం వెలువడే కథలలో 'రచయితల' మీద కథలు ఎక్కువగా ఉంటాయి. రచయితల హీరోయిజం జాస్తిగా ప్రత్యక్షమవుతుంది.

ఏమయినా -

సామాజిక జీవితంలో సాహిత్యం చాలా చిన్ని అంగం! రచయితలు ప్రత్యేక వ్యక్తులు! వారి కథలు పాఠకులకు విద్దూరంగా ఉండగలవేమో కాని ఉపయోగకరంగా ఉండవని గమనించాలి.

పోతే -

'నేను సైతం' మీద దాదాపు అందరూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సాహిత్య పరిస్థితి పట్ల సంతృప్తిగా లేనివారికి ఈ కథ తృప్తి నిచ్చింది. వారి విమర్శల్లో యీ క్రిందివి నవ్యతకూ, వైవిధ్యతకూ ప్రాధాన్యమిస్తూ బహుమానాలు కోసం నిర్ణయించ బడినాయి!

*'నచ్చిన అంశం' : ప్రథమ బహుమతి :* డా॥ బొద్దుల లక్ష్మయ్య (కరీంనగర్); *ద్వితీయ బహుమతి :* ఆర్. పురుషోత్తమరావు (హనుమాన్ జంక్షన్); రవి, రవిచంద్ర (దాచేపల్లి)

*'నచ్చని అంశం' : ప్రథమ బహుమతి :* పి.యస్. చారి (విశాఖపట్నం)

నచ్చిన అంశం

### ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

'నేను సైతం' అనే శీర్షికలో ప్రచురింపబడ్డ కథ ఆంధ్ర పాఠకలోకానికే కాక రచనలు చేస్తున్న వారికీ, రచయితలు కాగోరే వారికీ చక్కని మార్గాన్ని చూపించింది. రచయిత రవి తన మిత్రుడైన డాక్టర్‌తో కావించిన సంభాషణా రూపంలో నున్న యీ కథలో నేడు ప్రచురింపబడుతున్న రచనలు, ముఖ్యంగా సీరియల్స్, కథలూ విశ్లేషించబడ్డాయి. కథను అనగా సాహిత్యాన్ని ఆరాధించే వ్యక్తి తాను నమ్మిన ఆదర్శాలను ప్రదర్శించడానికి ప్రయత్నిస్తాడు. కళను వ్యాపారంగా మార్చదలచినవాడు తాను ప్రలోభపడడమేగాక ప్రజా బాహుళ్యాన్ని ప్రలోభానికి గురిచేస్తాడు. క్షణికమైన భావోద్వేగాలను కలిగిస్తుంటాడని నేటి రచయితలు గుర్తించాల్సిన అంశాలను రచయిత పేర్కొన్నారు.

ఇక నేటి సాహిత్యంలో చిత్రింపబడే సెక్స్ విషయాల్ని గూర్చి ముచ్చటిస్తూ వక్రమార్గాన్ని పట్టించే సాహిత్యం వల్ల ఉపదేశం కన్నా ఉన్మాదమే మిన్నగా ఉన్నట్లు రచయిత అభిప్రాయపడుతున్నారు. ఆడపిల్లల సుందర స్వప్నాలకి తాజా తాజా వేడి వేడి, సుందర సున్నిత కర్కశ హీరోలని వండి జనాలకి పెట్టాయి నేటి రచనలని వాపోతారు. అమ్ముడు పోయే కథా వస్తువు కళా ధర్మాన్ని గానీ, సామాజిక ధర్మాన్నీ గానీ నిర్వహించలేదు. దేన్నయినా వ్యాపార వస్తువుగా తూచే వ్యాపార ధర్మం మరే ధర్మాన్ని నెత్తికి ఎత్తుకోలేదు, అని తమదైన ఒక నిర్దిష్టమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

రచయితలో మనిషి - కళాకారుడు - వ్యాపారి అనే మూడు దశలు కన్పిస్తాయనీ చెబుతూ, రచయితలోని మనిషి అమ్ముడుపోగూడదనీ, చచ్చిపోగూడదనీ వివరించారు. కళాకారుడు తన హృదయాన్ని పాఠకుల ముందుంచాలి కాని తెలివితేటలు ప్రదర్శించి వారిని భ్రమపెట్టగూడదంటారు. కేవలం వ్యాపార దృక్పథంతో నేడు వెలువడుతున్న సాహిత్యాన్ని వివరిస్తూ రచయిత రవి నోట చెప్పించిన "నేను కళాకారుడిని డాక్టర్! ఆత్మని ప్రస్తుతానికి హత్య చేసుకున్నా!" అనే మాటలు రచయితలందరికీ కనువిప్పు కలిగించేట్టున్నాయి. అంతేగాక "తను జీవిస్తున్న జీవిత విధానం పట్ల గౌరవమూ, తృప్తి లేనివాడికన్న దురదృష్టవంతుడు లేడ"ని రచయిత చెప్పిన తీరు రచయితలు కాగోరేవారికి నిత్యమూ స్మరణీయం.

శ్రీశ్రీ గేయ పంక్తుల్ని తమదైన దృష్టితో మలచుకొని రచయిత "నేను సైతం భువన భువనపు బావుటనై పైకి లేస్తాను" అని చేసిన ముగింపు అత్యద్భుతంగా వుండి శీర్షికకు ఊపునిచ్చింది.

- డా. బొద్దుల లక్ష్మయ్య

ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణలు

పాఠకులనాకట్టుకునే విధంగా శీర్షికల నుంచి 'బహిష్టయిన భార్యతో రమించవచ్చు' వంటి కాప్షన్స్‌తో - చదువరులను రెచ్చగొట్టి పత్రిక సర్క్యులేషన్ పెంచుతూ - తనూ ఎదిగిపోతున్నానని భ్రమలో కొట్టుమిట్టాడుతున్న డాక్టర్ రచయితకూ - ఆడపిల్లల సుందర స్వప్నాలకి తాజా తాజా వేడి వేడి సుందర సున్నిత కర్కశ హీరోలను వండి జనాలకు పెట్టే రచనలు చేసిన 'స్పృహ గలిగిన రచయిత' మధ్య జరిగిన సమావేశం కథకు మూలం. ఇద్దరు రచయితలూ అంతరాంతరాల్లోని 'ఆత్మ'ను వెలికి తీసుకొని రావడం విశేషం.

'రచనలో కన్పించాల్సింది హృదయం తెలివి కాదు.

రచనలో వుండవలసింది తెలివి - హృదయం కాదు' అనే ఎమోషనల్ భావాల రచయిత -

"వందమంది రోగులను రక్షించలేకపోయినా ఒక్కడిని రోగిని చెయ్యరాదని వైద్యశాస్త్రం చెప్పదా! అంటూ మీరు చేస్తున్నది జ్ఞాన పానమని మీ విశ్వాసం - రోగ ప్రదానమేమోనని నా అనుమానం" అంటూ నిర్ద్వందంగా, నిష్కర్షగా చెప్పగల రచయితను అభినందించక తప్పదు. పాఠకుడిలోని పశుప్రవృత్తిని రేకెత్తించి, రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకునే బలహీనమైన మనస్తత్వం - తద్వారా పేరు, ప్రఖ్యాతి సాధించాలనుకోవడం గమనార్హం.

కమ్యూనిజం కవరులో రచనలు రాసి - ఓడిపోయి - పాఠకుల నాడిని పట్టేసి -

తనలోని మనిషిని నొక్కేసి అవురావురుమంటున్న కళాకారుడిని తట్టి లేపాడు. ఆ తర్వాత తన 'కళ'కు 'వ్యాపార దృష్టి'ని జోడించి కళాకారుడి చేత కూలిపని చేయించాడు. హిట్టయింది. డబ్బూ - దర్పం రెండూ వశమయ్యాయి. వ్యాపార దృష్టి రచయితలోని మానవ సంస్కారాలను మట్టుపెట్టడం మొదలెట్టాడు. ఇలా రెండు భిన్న కోణాల్లోని రచయితల మధ్య జరిగిన వాగ్వివాదాలన్నీ చదివాక - ఈనాటి రచయితలకు కనువిప్పు కలిగించే ప్రయత్నంలో కథారచయిత విజయం సాధించారనిపిస్తోంది.

ఏదేమైనా - రచనకూ/ మనిషి మనసుకూ సాపత్యం లేకుండా పోతుంటే సాహిత్యం రోగగ్రస్తమవుతుందని - చదువరుల బుద్ధి చెదపట్టి పోతుందనీ - విశ్లేషణాత్మకంగా వివరించడం నాకు నచ్చింది.

మనిషి వేరు / మనసు వేరు / కళ వేరు - అనుకోవడంలో వాటి మధ్య సమన్వయాన్ని సాధించకపోవడం - సాహితీలోకం నేడు రోగగ్రస్తమై 'కలల ప్రపంచాన్ని' కళ్ళ ముందుంచడం మీద అందరూ పునరాలోచించాలి - పతనానికి చేరువగా పత్రికలు - పడిపోకుండా కాపాడబడాలి. అప్పుడే జీవితంలో చైతన్యం వెల్లివిరుస్తుంది. ఆరోగ్యకరమైన సాహిత్యం అంతటా అచ్చవుతుంది.

- ఆర్. పురుషోత్తమరావు

"నేను కాలానికి కట్టేసుకున్నాను. ఎప్పుడు తెగిపోతుందో తెలీదు. ఎంత వెనుకబడి పోతానో తెలీదు! ఆడపిల్లల స్వప్నాల లోగిళ్ళలో ఏ కొత్త పూల మొక్క పూస్తుందో! ఒక చిన్ని ఆర్ద్రతా జలబిందువుకి నోచుకోలేక యేనాడు వాడిపోతానో! నా యింద్రజాలం, జగ్లింగ్ ఎప్పుడు యీ ఆంధ్ర దేశపు యువతరం ముందు పాతబడిపోతుందో! ఏ కొత్త యింద్రజాలికుడు నన్ను తోసేసి, తొక్కేసి యీ రంగస్థలాన్ని దురాక్రమణ చేస్తాడో!"

తనుగా మరణించిపోయి ఒక వస్తువుగా, ఇన్‌స్ట్రుమెంట్‌గా పైకి వచ్చిన మనిషిగా ఒక సంచలన రచయిత చనిపోతూ పడిన అంతర్మథనం-

ఆరోగ్యవంతులకి కొత్త సమాచారం యిస్తూ వారిని అనారోగ్యవంతుల్ని చేసే అవకాశం కల్పిస్తున్న, వ్యాపారస్తుడో కాదో, తెలీదు కానీ - కళాకారుడు కాని మరో డాక్టర్ రచయిత అంతర్ముఖం -

రచన కథాప్రహేళిక (8) "నేను *సైతం!*'

ఎప్పుడో 85లో ఆత్మవంచకులకు నిహలానీ రి'పార్టీ' అంటూ 'గౌస్'గారు వ్రాసిన సమీక్ష స్ఫురణకు వస్తుంది -

'కళలూ, సాహిత్యం, జీవితం, విలువలూ అంతా ఒక మాయ, మోసం. కపటమైన, నీచమైన కుహనా నాటకం. ఆధునిక సాహిత్యం కళా ప్రపంచం ఒక భయానక వంచనా

శిల్పం. జీవన కాలుష్యంలోకి సాహిత్యం, సాహిత్య దగుల్బాజీతనంలోకి సాహిత్య జీవితం పోటీపడి ప్రవేశిస్తున్నాయి.

అలాగే 'కళాకారుడి పని కళాప్రదర్శన యేనా, మనిషిగా తన విశ్వాసాలకూ, కళకూ సంబంధం లేదా?' అన్న ప్రశ్నతో అనుక్షణం తీవ్ర మానసిక సంక్షోభానికి, సంఘర్షణకి లోనై చివరకు 'జన ప్రయోజనమే కళకు సార్థకం' అనే నిజంతో కన్నెర్ర చేసిన, శవప్రాయమౌతున్న కళకు జీవం పోసిన చిత్రకారుడు 'రవి'గా బి. నరసింగరావు 'రంగుల కల' గుర్తుకొస్తుంది.

ఒక ప్రయోజనం కోసం వ్రాయబడ్డ ఈ కథ సమకాలీన సాహిత్య ప్రపంచాన్ని ప్రతిబింబిస్తూ అని కోణాల్నుంచీ ప్రతిఫలిస్తూ 'రచన కథాప్రహేళిక'లోని యిప్పటి కథలన్నింటిలోకి అగ్రగామి అయ్యింది. అయితే నిహలాని 'పార్టీ' చిత్రానికి కథలేనట్లే, దీనికి స్పష్టమైన కథ లేకున్నా కథకు మించిన 'కథ' - కథనే గుండె మీద చెయ్యేసుకు చెప్పిన ప్రతి మాట - శ్రీశ్రీ 'నేను సైతం' లా మ్రోగించి! - ముఖ్యంగా "డాక్టరు రచయిత" బురఖా చింపేసి, అతడికి 'సాహితీవైద్యం' చేసిన తీరు ఆ సందర్భంలో మాట్లాడిన ప్రతి మాట సరైన ప్రయోజనాన్ని సాధించాయి. ఎగ్జిబిషన్ మనస్తత్వాన్ని (వుత్తరాల్లో) గుర్తుపట్టే అర్హత వుందంటూ, 'రేపరు చుట్టి కల్తీ సరుకు చెల్లుబాటు చేసే వాడికే పుచ్చుకునే నోటులో చిల్లుల గూర్చి భయం! 'డాక్టరుగా జ్ఞానదాన విశ్వాసం, రోగ ప్రదాన అనుమానం అంటూ ఆధారాలు చూపిస్తూ 'మనకి జుగుప్స' సందర్భం కూడా వుద్రేక సృష్టికి పనికి వస్తుంది'; 'కళాకారుడు కళాప్రదర్శనో, వ్యాపారమో తను చేస్తున్నది తేర్చుకోకపోవటం విషాదం' అనటం! కన్పించాల్సిన హృదయం. వుండాల్సిన తెలివి తారుమారై రచనలు సృజనాత్మకత కోల్పోవటం గురించిన విశ్లేషణ - జ్ఞానాన్ని సెక్సు రేపరులో చుట్టి అమ్ముకోవటం - అంటూ ఆఖరి ముసుగూ చింపేసి తనలోకి తను పోవటం - తాగితే మనిషి కాదంటారు కానీ మరణించిన వాళ్ళ లోకంలో తాగితేనే బ్రతుకు, తాగితేనే మనిషి!

జీవితాన్ని మార్చిన ఏడవ నవల్నుండీ, చావులు పేలాయా, భూతాలు పేలాయా డైలమా వరకూ 'సాహిత్యం తిరోగమిస్తుందా, పురోగమిస్తుందా' చర్చి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ మత్తు, కళ కళ కోసం మనిషిని నిద్రపుచ్చితే రవి 'చెల్లే పదార్థమై' యిచ్చ నశించి, కళ్ళు తెరిచి (సగమే) తన కోసం వ్రాయబోయి - అదీ పొల్యూట్ చేసి - వ్యాపారై, కూలివాడై విజయ సంకేతాన్ని, సాధనం చేసుకుని నిస్సహాయతకి వగచి - అర్థరాత్రి తెలియని దేశాల వింత నగరాల హోటళ్ళలో మద్యం సేవించి, ప్రేమించబడి, శపించబడి చివరకు చిన్నాన్న వ్యక్తిత్వ ప్రభావంతో (వ్యాపారి) ఆత్మని హత్య చేసుకొని -

మనిషిగా, కళాకారుడిగా పునర్జన్మించి కొత్త 'రచన'కి శ్రీకారం చుదుతూ -

"నేను సైతం
రచన ప్రపంచపు
నిజాయితీనై మంచినిస్తాను!"

"పుడమితల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని, కొత్త రచనని స్ఫురింపించాయి"

ఒక రచయిత కొత్త రచయితగా పుట్టి, మంచి రచయితగా పెరిగి, చెత్త రచయితగా రిటైరవుతాడన్న విధానం కథలోని 'రవి' పాత్ర మలచబడింది. అయితే చెత్త రచయితగా రిటైరవ్వకుండా మళ్ళీ కొత్త రచయితగా మొదలవ్వటంతో కథ ముగుస్తుంది.

తన నుంచి - మళ్ళీ మంచి రచనలు, ఆదర్శ ప్రాయమైన కథలు, నవలలూ ఆశిస్తూ ఈ కథ.

'జన ప్రయోజనమే కళకి సార్థకత' అని చాటి చెప్పినందుకు అభినందిస్తూ

- రవి, రవిచంద్ర

**నచ్చని అంశం**

**ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ**

'నేను సైతం' కథ చదవడం మొదలుపెట్టగానే ఒక రచయిత, డాక్టరు మధ్య సంభాషణగా మనకి అర్థమవుతుంది. కాని కథ చదువుతున్నపుడు మధ్య మధ్య ఎవరు ఏం మాట్లాడారో తెలుసుకోవడానికి మళ్ళీ పేజీ రిఫర్ చేయవలసి వచ్చింది. అసలు కొన్ని పేజీల వరకు అంతా కన్ఫ్యూజ్‌గా ఉంది. ఇంకా ఎన్ని పేజీలు చదవాలా? అని పేజీలు లెఖ్ఖ పెట్టుకొనే పరిస్థితి కూడా వచ్చింది.

రచయిత తన ఆత్మఘోష నంతటినీ ఈ కథలో చొప్పించారనిపించింది. ఎంతో ఓపిగ్గా చదివితే ఆఖరు పేజీ వచ్చేసరికి రిలీఫ్ కలిగింది. అయితే కథ మధ్యలోను, ఆఖరు లోను రచయితగా ఆయన చెప్పదలచుకున్న కొన్ని విలువైన విషయాలను వెల్లడించారు. అందువలన చదివిన వాళ్ళకు కాస్తంతైనా కొన్ని మంచి విషయాలు తెలుసుకున్నామన్న ఆత్మతృప్తి కలుగుతంది.

ఒక విధంగా చెప్పాలంటే ఈ కథ పాఠకుల కోసం కాకుండా రచయితల కోసం వ్రాసినట్లుగా ఉంది.

ఈ కథలో నాకు నచ్చిన వాఖ్య :

"తను జీవిస్తున్న జీవిత విధానం పట్ల గౌరవమూ, తృప్తి లేనివాడికన్నా దురదృష్ట వంతుడు లేడని ఈ మధ్యనే నేనొక చోట అన్నాను" అనే రచయిత వాఖ్య.

- పి.యస్. చారి